క్లుప్తంగా

శింగరకొండ తిరునాళ్లకు ఆహ్వానం



బాలినేనికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న శ్రీనివాసకుమార్

అద్దంకి రూరల్: ఈనెల 5 నుంచి ప్రారంభమవుతున్న శింగరకొండ 68వ వార్షిక తిరునాళ్ల ఆహ్వాన పత్రికను దేవస్థాన పాలకమండలి అధ్యక్షుడు కోట శ్రీనివాస కుమార్ శుక్రవారం ప్రముఖులకు అందజేసి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో పాటు శిద్దాహనుమంతరావు, శిద్దా భరత్‌లకు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

పనిముట్లతో పనులకు రావాలి

బల్లికురవ: ఉపాధి హమీలో పనులు చేసే కూలీల జత గడ్డపార, చెలకపార, తట్టతో పనులకు రావాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. శుక్రవారం ఉప్పుమాగులూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హమీ పథక పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. మొక్కుబడిగా పనులకు వస్తే కూలీ గిట్టుబాటు కాదని కొలతల ప్రకారం టీమ్‌లుగా ఏర్పడి పనులు చేయాలని ఎంపీడీవో చెప్పారు. తండ్రి, తల్లులకు బదులుగా పిల్లలు పనులకు వస్తే ఫీల్డ్ అసిస్టెంట్‌లను అదుపులోకి తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

165 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

వేటపాలెం: మినీలారీతో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం అర్ధరాత్రి పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. మండలంలోని పందిళ్లపల్లిలో ప్రధాన రహదారిపై వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం వేటపాలెం నుంచి ఒంగోలు వైపు వెళ్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పౌరసరఫరాల శాఖ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘా ఉంచి పట్టుకున్నారు. మినీ లారీని వేటపాలెం పోలీస్ స్టేషన్‌కి తరలించి పరిశీలించగా అందులో 165 బస్తాలు రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ బియ్యాన్ని మోటుపల్లికి చెందిన వెంకట్రావు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వేటపాలెం ప్రాంతంలో మూడు రేషన్ షాపుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసినట్లు పలువురు డీలర్లు బహిరంగంగా చర్చించుకొంటున్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

చినగంజాం: బాల్య వివాహాల కారణంగా పలు అనర్థాలు కలుగుతాయని, బాలికలు దూరంగా ఉండాలని ఇంకొల్లు మండలం పావులూరు హైస్కూల్ హెచ్‌ఎం గిరిజారాణి అన్నారు. భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమంలో శుక్రవారం బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చేస్తే బాలికలు అతి చిన్న వయస్సులో అనారోగ్యాల పాలవుతారని, పుట్టే బిడ్డలు అనారోగ్యంగా పుట్టేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. తక్కువ బరువుతో పుడతారని, తక్కువ వయస్సులో వివాహం చేసుకుంటే కలిగే అనర్థాలను గురించి వివరించారు. రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన ఆహారం గురించి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాణి పిల్లలకు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర్ బాలికలు పాల్గొన్నారు.

ఎరువులు దుకాణాలపై విజిలెన్స్ దాడులు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

చినగంజాం: ఇంకొల్లులోని ఎరువుల దుకాణాలపై శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని సాగర్ ఎంటర్‌ప్రైజెస్, పవన్ ఆగ్రో ఎంటర్ ప్రైజెస్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. సాగర్ ఎంటర్ ప్రైజెస్ దుకాణంలో ఉన్న ఎరువుల నిల్వలకు, రికార్డులకు తేడాలున్నట్లు గమనించారు. రెండింటికి సుమారు రూ 3.74 లక్షలు తేడా ఉండటంతో ఎరువులను సీజ్ చేసి దుకాణంపై 6-ఏ కేసు నమోదు చేశారు. దుకాణంలో రూ 5.18 లక్షల అమ్మకాలను నిలిపివేశారు. అదే విధంగా పవన్ ఆగ్రో ఎంటర్ ప్రైజెస్ దుకాణంలో సరుకు నిల్వలకు రికార్డులకు రూ.5.52 లక్షలు వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించి దుకాణంపై 6-ఏ కేసు నమోదు చేశారు. దుకాణంలో రూ 2.40 లక్షల పురుగు మందులు నిలుపుదల చేసినట్లు విజిలెన్స్ ఏఓ వాసంతి, సీఐ శ్రీహరిరావులు వివరించారు. తనిఖీల్లో ఇంకొల్లు ఏవో నార్నె వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

తొలిమెట్టు బలంగా

- పదిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- పరీక్ష రాయనున్న 2454 మంది పదో విద్యార్థులు



తిమ్మాయపాలెం పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

అద్దంకి: ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి చాలా ముఖ్యమైనది. ఇక్కడి నుంచే తన చదువుల్లో పోటి ప్రస్థానం మొదలవుతుంది. ప్రతి విద్యార్థికి పదో తరగతి తొలిమెట్టు. పదో తరగతిలో సాధించే జీపీఏ, ఆ విద్యార్థి భవిష్యత్ చదువును లెక్కగట్టే గణాంక పరికరంగా మారుతుంది. దానిని దృష్టిలో పెట్టుకుని పరీక్షల్లో వందశాతం ఉతీర్ణతే ధ్యేయంగా విద్యాశాఖ ప్రణాళిక రచించింది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను ఉదయం, సాయంత్రం వేళల్లో ఏర్పాటు చేసి, ప్రతి రోజూ ఒక పాఠంలో విద్యార్థులకు తర్ఫీదునిచ్చి వారి సామర్థ్యాలను కొలుస్తోంది. గతంలో పదిలో 11 ప్రశ్నపత్రాలు ఉండగా, ప్రస్తుతం వాటిని ఏడుకు కుదించారు. ఈ నేపథ్యంలో ఆయా పరీక్షలు ఎలా రాయాలో తెలియచెప్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఏప్రిల్ 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు ఉపాధ్యాయులు.

ప్రత్యేక తరగతులు..

ఈసారి పబ్లిక్ పరీక్షలు ఏడు పేపర్లుగా ఒక్కో పరీక్ష 3.15 గంటల వ్యవధితో 100 మార్కులకు నిర్వహించనున్నారు. ఉదయం 6నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. కోవిడ్ ప్రభావం తగ్గిపోవడంతో ఈఏడాది సకాలంలో సిలబస్‌ను ఉపాధ్యాయులు గతేడాది డిసెంబర్ నాటికే పూర్తి చేశారు. అద్దంకి నియోజకవర్గంలోని 42 పాఠశాలల నుంచి 2454 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. పరీక్షలంటే భయం లేకుండా ఒత్తిడికి గురికాకుండా విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు ఉపాధ్యాయులు.

మండలం	పాఠశాలలు	పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు
అద్దంకి	13	711
సంతమాగులూరు	9	497
బల్లికురవ	8	467
జే పంగులూరు	6	481
కొరిశపాడు	6	298

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ..



సిలబస్ పూర్తయింది. ఇక విద్యార్థులకు చెప్పిన పాఠాలను పునఃశ్చరణ చేయించే పనిలో ఉన్నాం. ప్రత్యేక తరగతులు పెట్టి ప్రతి రోజూ ఒక పాఠంలో వారికి సామర్థ్య పరీక్ష నిర్వహిస్తున్నాం. పబ్లిక్ పరీక్షలంటే భయం లేకుండా చేయడంతోపాటు నూటికి నూరు శాతం సాధనపై దృష్టి పెట్టాం.

–కేవీ శ్రీనివాసరావు, హెచ్‌ఎం, తిమ్మాయపాలెం

ప్రత్యేక తరగతులతో ఉపయోగంగా ఉంది..



ప్రత్యేక తరగతులు మాకు ఎంగానో ఉపయోగపడుతున్నాయి. ప్రతి పాఠం మరలా పునఃశ్చరణ చేయిస్తున్నారు. అందులో తెలియని అంశాలను మరలా తెలియజేప్పి, మాకు పబ్లిక్ పరీక్షల్లో మంచి జీపీఏ సాధిస్తామనే నమ్మకం కలిగిస్తున్నారు.

–వై ప్రణీత్, విద్యార్థి, తిమ్మాయపాలెం

రివిజన్‌తో ఉపయోగం..



చెప్పి చదివిన పాఠాలను రివిజన్‌ను ఉపాధ్యాయుల సమక్షంలో చేయడం ఉపయోగం. అందులోనూ ప్రతి రోజూ ఒక పాఠంలో పరీక్ష పెట్టడం వల్ల పబ్లిక్ పరీక్షల్లో ఏ ప్రశ్న ఇచ్చినా సమాధానం రాయడానికి సిద్ధంగా ఉన్నాం.

జీ సృజన, విద్యార్థి చందలూరు

శ్యాంప్రసాద్‌రెడ్డికి భారీ మెజార్టీ అందిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆమంచి, అభ్యర్థి శ్యాంప్రసాద్ రెడ్డి

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్
- గెలిపించాలంటూ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి అభ్యర్థన



హాజరైన నాయకులు, ప్రజాప్రతినిధులు

పర్చూరు: ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో నియోజక వర్గంలోని పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమంచి మాట్లాడుతూ శ్యాంప్రసాద్‌రెడ్డి సేవాభావం కలిగిన వ్యక్తి అని ఆయనను శాసన మండలికి పంపితే పట్ట భద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. అందుకు ప్రతి కార్యకర్త మండల స్థాయిలో, గ్రామస్థాయిలో పట్ట భద్రుల ఓటర్లందరిని ఒక వాట్సప్ గ్రూపు తయారు చేసి స్థానిక నాయకులందరూ దానిలో ఉండి ఓటర్లను చైతన్య పరచాలన్నారు. ప్రతి గ్రామంలో స్థానిక నాయకులు ఓటర్ల ఇంటికి వెళ్లి ఓటర్లను చైతన్య పరచాలని, బ్యాలెట్ పేపర్‌లో 1వ నంబరు సంఖ్యను వేసేలా ఓటర్లుకు అవగాహన కల్పించాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి మాట్లాడుతూ పట్ట భద్రుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 34,108 ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వగా, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2.06 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాలను కలుపుకొని 6.16 లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ఈ ఘనత వైఎస్ జగన్ మోహనరెడ్డికే సాధ్యమైందన్నారు. తనను గెలిపిస్తే ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారి అభివృద్ధికి పాటు పడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ, మండల కన్వీనర్‌లు కఠారి అప్పారావు, బండారు ప్రభాకరరావు, పఠాన్ కాలేషా వలి, దండా చౌదరి, ఎంపీపీలు మేకా ఆనంద కుమారి, నీరుకట్టు వాసుబాబు, భూక్యాశాంతిబాయి, జెడ్పీటీసీలు చుండి వెంకట లక్ష్మీనారాయణమ్మ, యార్లగడ్డ రజని, రాష్ట్ర సంగీత నృత్య అకాడెమీ డైరక్టర్ యద్దనపూడి హరిప్రసాద్, కొల్లా సుభాష్, తోకల కృష్ణమోహన్, పాలెపోగు రాంబాబు, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకోవాలి



నమూనా బ్యాలెట్ చూపిస్తున్న వెంకటేష్, ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్

చీరాల రూరల్: తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక గోలి సదాశివరావు కళ్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎటువంటి సమస్యలు ఉన్నా తక్షణమే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. నేటి నుంచి ప్రతి కార్యకర్త, నాయకులు ఇంటింటికి వెళ్లి అమూల్యమైన ఓట్లు వేయించేలా చేయాలని పేర్కొన్నారు. రెండు ఎమ్మెల్సీలను గెలిపించి ముఖ్యమంత్రి జగనన్నకు కానుకగా ఇవ్వాలని ఆయన కార్యకర్తలను, నాయకులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, రామసుబ్బులు, కౌన్సిలర్లు, పొత్తూరి సుబ్బయ్య, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, గొట్టిపాటి ఎబినేజర్, గవిని శ్రీనివాసరావు, మల్లి వైష్ణవి, కావూరి రమణారెడ్డి, నల్లబోతుల రాజ్ కుమార్, నాదెండ్ల కోటేశ్వరరావు, పార్టీ నాయకులు, వైఎస్సార్ టీఎఫ్ ఉపాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీ, ఇద్దరి మహిళలకు గాయాలు

అద్దంకి రూరల్: రోడ్డు దాడుతున్న ఇద్దరు మహిళలను ద్విచక్రవాహనం ఢీకొట్టటంతో గాయాలైన ఘటన శుక్రవారం రాత్రి అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు... జేపంగులూరు మండలం చందలూరు గ్రామానికి చెందిన మహిళలు స్థానిక సిండికేట్ బ్యాంకు ఎదురుగా ఉన్న ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి చూపించుకుని బయటకు వస్తున్నారు. అద్దంకి-నార్కెట్‌పల్లి నామ్ రహదారి దాటుతుండగా బైకు ఢీకొట్టింది. దీంతో ఇరువురు మహిళలకు గాయాలయ్యాయి. వారిలో గర్భిణి సృహతప్పి పడిపోవటంతో 108 వాహనం ద్వారా అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

చీరాల టౌన్: సచివాలయాల్లో పనిచేసే వెల్ఫేర్ అసిస్టెంట్లు సాంకేతికతను అందిపుచ్చుకుని సేవలందించాలని ఎంపీడీవో కె.నేతాజీ సూచించారు. శుక్రవారం మండలంలోని గ్రామ పంచాయితీల్లోని సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లుతో సమావేశాన్ని ఎంపీడీవో నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉద్యోగులు అందరు టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని ప్రజలకు నిర్ణీత సమయంలోగా ప్రభుత్వ సేవలను అందించాలన్నారు. అనంతరం చీరాల నగర్ 1 లేఅవుట్ నిర్మాణ పనులను ఎంపీడీవో పరిశీలించారు. ఇంటి నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఎంపీడీవోతో పాటుగా పంచాయితీ సెక్రటరీలు, సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్టూరు: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మరణించాడు. ఈఘటన శుక్రవారం రాత్రి వెలుగు చూసింది. అందిన వివరాల మేరకు.. స్థానిక శాంతి నగర్ కాలనీకి చెందిన వల్లెపు వెంకటేశ్వర్లు (48) గత బుధవారం మార్టూరులో గడ్డి మందు తాగి తమ కాలనీ ప్రారంభంలోని షాపుల వద్ద వాంతులు చేసుకున్నాడు. మందు వాసన గమనించిన స్థానికులు సమాచారంతో బంధువులు వెంకటేశ్వర్లును గుంటూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లు పరిస్థితి విషమించడంతో శుక్రవారం సాయంత్రం మరణించాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

పార్టీ అభ్యర్థి విజయానికి కృషి



మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: వైఎస్సార్ సీపీ పార్టీ బలపరచిన ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. పట్టణంలోని కామేపల్లి కల్యాణ మండపంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల గురించి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా కృష్ణచైతన్య హాజరయ్యారు. పార్టీ బలపరచిన తూర్పు రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ బాచిన చెంచుగరటయ్య పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు జరుగుతున్న మేలును వివరించి పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలుపునకు కృషిచేయాలని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్లు దేశు పద్మేశ్, కే అనంతలక్ష్మి, పులికం కోటిరెడ్డి, జంపాని రవిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు జ్యోతి మనుమంతరావు, పట్టణపార్టీ నాయకుడు కాకాని రాధాకృష్ణమూర్తి, చింతల పేరయ్య, సందిరెడ్డి రమేశ్, సాధినేని మస్తాన్‌రావు, అవిశన ప్రభాకర్‌రెడ్డి, చిన్ని శ్రీమన్నారాయణ, సోనీ, కొల్లా భువనేశ్వరి, ఎంపీటీసీలు, వార్డు ఇన్‌చార్జులు, కౌన్సిలర్లు, సోషల్ మీడియా కన్వీనర్లు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో సునీత



సమ్మిట్‌లో పాల్గొన్న ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల: విశాఖపట్నంలో శుక్రవారం ప్రారంభమైన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత పాల్గొన్నారు. సమావేశాల్లో పాల్గొనేందుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రం ఐటీ రంగంలో ముందుకు సాగేందుకు సమ్మిట్ ఎంతో దోహదపడుతుందన్నారు.

మిరప పంటను పరిశీలించిన శాస్త్రవేత్త



మిరప పంటను పరిశీలిస్తున్న లాంఫామ్ శాస్త్రవేత్త, అధికారులు

అద్దంకి: నకిలీ విత్తనాలతో నట్టేట మునిగానని మిరప రైతు ఉద్యానశాఖ అధికారులను ఆశ్రయించాడు. సంతమాగులూరు మండంలోని కొమ్మాలపాడు గ్రామ రైతు ఖాదర్ వలీ. రైతు ఫిర్యాదు మేరకు శుక్రవారం మిరప పంటను లాంఫామ్ శాస్త్రవేత్త వెంకట రమణ స్థానిక వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో కలసి పరిశీలించారు. బాధిత రైతు వివరాల మేరకు.. కొమ్మాలపాడు గ్రామానికి చెందిన ఖాదర్ వలి 5.50 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని మక్కెనవారిపాలెం గ్రామంలోని నర్సరీలో యూఎస్ 341 రకం నారును రూ.1లక్ష వ్యయంతో మొక్కలు కొనుగోలు చేసి ఆరు నెలల క్రితం నాటాడు. నాటిన నెలకే మొక్కలు గిడసబారడంతోపాటు, పొట్టి కాయలు కాస్తుండడంతో నిలువునా మునిగానని రైతు గమనించాడు. నర్సరీ యాజమాన్యాన్ని ప్రశ్నించడంతో వారు స్పందించలేదు. దాంతో ఉద్యాన శాఖ అధికారులకు రైతు ఫిర్యాదు చేశారు. దీంతో శాస్త్రవేత్త వెంకటరమణ, మార్టూరు ఉద్యాన, సంతమాగులూరు వ్యవసాయ శాఖ అధికారులతో కలసి తోటను పరిశీలించారు. పరీక్ష నిమిత్తం కొన్ని మొక్కలను శాంపిల్‌ను సేకరించి తీసుకెళ్లారు. రిపోర్టును బట్టి మోసం జరిగిందని తేలితే నర్సరీ యాజమాన్యం, విత్తన కంపెనీపై చర్యలు తీసుకుంటామని శాస్త్రవేత్త చెప్పారు. నష్టపరిహారం ఇప్పించాలని అధికారులను కోరాడు. మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో ఆర్ లావణ్య, హార్టికల్చర్ అధికారి హనుమంతు నాయక్ స్థానిక రైతులు ఉన్నారు.

పిల్లలను సన్మార్గంలో నడిపే బాధ్యత తల్లిదండ్రులదే



సమావేశంలో పాల్గొన్న రైల్వే పోలీసులు, షాడోస్ సిబ్బంది

చీరాల రూరల్: పిల్లలను సన్మార్గంలో ప్రోత్సహించి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని రైల్వే ఆర్పీఎఫ్ సీఐ ఎం. శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక రైల్వే స్టేషన్‌లో షాడోస్, నోబెల్ అవార్డు గ్రహీత డాక్టర్ సత్యార్థి ఫౌండేషన్, కేఎస్‌సీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో వీధి బాలలు, మానవ అక్రమ రవాణా అనే అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షాడోస్ ప్రతినిధి రాజా సాల్మన్ మాట్లాడుతూ వీధి బాలలు, బాల బాలికలు మాదకద్రవ్యాలకు ఎక్కువగా ఆకర్షితులై బాల్యాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు ఏం చేస్తున్నారనే విషయమై నిరంతరం గమనిస్తూ ఉండాలని సూచించారు. ఆల్కాహాల్‌తో పాటు పారిశ్రామిక జిగురు, వైట్నర్ వంటి మత్తు పదార్థాలు చిన్న పిల్లల పాలిట పెద్ద సమస్యగా తయారయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బి. భాగ్యలక్ష్మి, పి. తులసి, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ధాన్యంపై రుణ సదుపాయం

అద్దంకి: రైతులు పండించిన ధాన్యాన్ని సొసైటీ గోడౌన్‌లో దాచి దానిపై రుణం పొందవచ్చని ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో కుంభ రామయ్య అన్నారు. శుక్రవారం ఆయన సంతమాగులూరు మండలంలోని వెల్లలచెరువు గ్రామ సొసైటీలోని ఒక రైతుకు రాష్ట్రంలోనే తొలిసారిగా ధాన్యంపై రుణం మంజూరు చేసి రసీదు అందజేశారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ సొసైటీ గోడౌన్‌లో ధాన్యం నిల్వ పెట్టుకున్న రైతులు ఎన్‌ఈఆర్ఎల్ (నేషనల్ వేర్ హౌసింగ్ డెవలప్‌మెంట్ అథారిటీ)లో ఒక ఖాతాను ప్రారంభించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం వెల్లలచెరువు సొసైటీలో నాలుగు వేల టన్నుల కెపాసిటీ కలిగిఉందన్నారు. ఇందులో వరి, మొక్కజొన్న, కందులు, శనగలు, మినుములు నిల్వ చేసుకోవచ్చన్నారు. వాటిపై మద్దతు ధర మీద 75 శాతం రుణంగా ఇస్తారని, ఈ సదవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నెగోషియల్ రసీదు మంజూరు చేయడంలో ముందడగు వేసిన వెల్లలచెరువు సొసైటీ పాలకవర్గాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో వెల్లలచెరువు పాక్స్ ప్రెసిడెంట్ చింత శ్రీధర్, బీ జీఎం రాంబాబు నాయక్, జిల్లా పాక్స్ డెవలప్‌మెంట్ మేనేజర్ టీపీపీ నరసింహరావు, సహకార సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన జేసీ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

అద్దంకి: త్వరలో నిర్వహించనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని పోలింగ్ స్టేషన్లను బాపట్ల జిల్లా జేసీ శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. దీనిలో భాగంగా ఆయన తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, రెవెన్యూ అధికారులతో కలసి ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. అవసరమైన వసతులు, గోప్యత సక్రమంగా ఉందో లేదో తెలుసుకున్నారు. ఏదైనా వసతులు కల్పించాల్సి ఉంటే వెంటనే కల్పించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

97 శాతం పింఛన్లు పంపిణీ

బల్లికురవ: మండలంలోని 20 సచివాలయల పరిధిలో 97 శాతం మేర పింఛన్లు పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7772 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా 7702 మందికి పంపిణీ పూర్తయిందని శని ఆదివారాల్లో ఇంటింటికి తిరిగి నూరు శాతం పంపిణీ పూర్తిచేస్తామని చెప్పారు.